క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై ప్రాజెక్టు నిర్వహించాలని వినతి

దురాజ్‌పల్లి : సూర్యాపేట జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక ప్రాజెక్టు నిర్వహించాలని నడిగూడెం మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ జర్నలిస్టు, ప్రకృతి వ్యవసాయం ప్రచారకర్త మొలుగూరి గోపయ్య కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్‌లకు వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లాలో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. పెట్టుబడులు తగ్గించుకొని సహజ సిద్ధ పద్ధతులు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. ఇంకా అనేకమంది రైతులను చైతన్యపరచి అవగాహన కార్యక్రమం నిర్వహించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగినేని లక్ష్మీకాంతరావువనమ్మ దంపతుల చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగినేని మోహన్‌రావు, దండ ప్రతాప్‌రెడ్డి, తూములూరి శాంతమ్మ, నీలకంఠం వేదవతిర వీందర్, పేరూరి వెంకటేశ్వర్లు, రాములు, వలపట్ల కృష్ణ, జయరామ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



తిరుమలగిరిలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని సంచార జాతుల వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జలగం రామచంద్రం గౌడ్, కార్యదర్శి ఐతె శ్రీనివాస్, కోశాధికారి సురేష్‌కుమార్, సభ్యులు లక్ష్మణ్, గణేష్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారిగా హస్త్రీత



నూతనకల్ : మండల వైద్యాధికారిగా హస్త్రీత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ వైద్యాధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

ఆర్థికసాయం అందజేత

దురాజ్‌పల్లి : అనారోగ్యంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చివ్వెంల మండలం గుడితండాకు చెందిన మాజీ ఎస్ఎఫ్ఐ నాయకుడు ధరావత్ నాగు నాయక్‌కు నాటి ఉద్యమంలో పని చేసిన స్నేహితులు సోమవారం రూ. 31,500 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి కొలిశెట్టి యాదగిరిరావు, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం, కిరాణ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ, ప్రెస్ క్లబ్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు వజ్జ వీరన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఊట్కూరు సైదులు, సూర్యాపేట ఎస్ఎఫ్ఐ మాజీ డివిజన్ కార్యదర్శి పిడమర్తి అబ్రహం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి, పట్నం జిల్లా కార్యదర్శి జిల్లపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన ఎర్ర చిన్న నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ఫణిగిరికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు సోమవారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10,000ల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్ర నరేష్, బీఆర్ఎస్ నాయకులు మామిడి మల్లయ్య, ఆకారపు శ్రీను, కడారి పద్మయ్య, పంది సుధాకర్, కన్నె మాణిక్యం, జాన్‌వెస్లీ, ఎర్ర అంబేద్కర్, ఎర్ర అశోక్, ఎర్ర బాబు, శ్రీకాంత్, వెంకటేష్, దేశోట్, మహేష్, కళ్యాణ్, మధు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి..

నాగారం మండల కేంద్రానికి చెందిన చేను లత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ సందర్భంగా ఆమె కుమారుడైన చేను సందీప్ స్నేహితులు సోమవారం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000ల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అనంతుల సోమేష్, కన్నెబోయిన సందీప్, అజయ్, శ్రావణ్, రాజు, మహేష్, ప్రశాంత్, గణేష్, శంకర్ పాల్గొన్నారు.



దురాజ్‌పల్లి : సూర్యాపేటలో ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు



సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు



సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు



పేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రత్యేక మండపం వద్ద కోరిక చిట్టీలు రాస్తున్న భక్తులు

సూర్యాపేట : ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని జిల్లా ప్రజలు సోమవారం వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని దేవాలయాల్లోనూ ఉత్సవ మూర్తులు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో భారీ గోపురాలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో శ్రీగోదాపద్మావతీ సమేత శ్రీనివాసుడు ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు. ఆండాళ్‌గోష్టి భక్తబృందం సభ్యులు దేవాలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో ఉచితంగా ప్రసాదాలు, మంచినీరు అందించారు. పట్టణానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, డీఎస్పీ నాగభూషణం, కమిషనర్ రామాంజనేయులు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

సూర్యాపేట రూరల్ : ముక్కోటి ఏకాదశి మహా పర్వదినం సందర్భంగా పిల్లలమర్రి గ్రామంలోని శివాలయాల్లో శివపార్వతులకు భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పరమశివుడికి విశేషంగా పంచామృతాలతో రుద్రాభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో శివాలయాల చైర్మన్ వల్లాల సైదులు, అర్చకులు మునగలేటి సంతోష్‌శర్మ, మాజీ చైర్మన్ రాపర్తి సైదులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను సోమవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న కూడారై ఉత్సవాలు, 14న గోదారంగనాథ స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించబతుందని, ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల వెంకన్న కోరారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాటూరి రామాచార్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.

భానుపురి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని భగవద్గీత మందిరంలో సోమవారం భక్తులకు శ్రీరామ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తోట శ్యామ్ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అయప్ప స్వామి దేవాలయ అధ్యక్షుడు నరేంద్రుని విద్యాసాగర్, గుడిపాటి సురేష్, గుండా శంకర్, తోట శ్రీను, ఓరుగంటి అనీల్, మొరిశెట్టి రామ్మూర్తి, వాడపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథస్వామి ఆలయంలో పూజలు

పవిత్రమైన పుష్య మాసం సందర్భంగా స్థానిక విశ్వనాథ స్వామి ఆలయంలో స్వామివారికి సోమవారం కుంకుమ పూజలు, అష్టోత్తర నామావళి, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అతిపురాతనమైన, మహిమాన్వితమైన శివాలయ దర్శనంతో మహాశివుని ఆశీస్సులు లభిస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి వీరభద్రశర్మ తెలిపారు. అభిషేకాల అనంతరం స్వామివారికి పూలమాలలతో అలంకరణ చేశారు. ఈ పూజల్లో ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎ.లక్ష్మణరావు, ఆలయ సహాయ అర్చకులు సాగర శర్మ పాల్గొన్నారు.

శ్రీవిజయాంజనేయస్వామి ఆలయంలో..

సూర్యాపేట జిల్లాకేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌లో ఉన్న శ్రీవిజయాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు వరదాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారి మంగళ శాసనాలు భక్తులకు అందించారు. తదనంతరం శ్రీ సీతారామస్వామి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అలాగే వేణుగోపాస్వామి, సంతోషిమాత దేవాలయాల్లోనూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామిఅమ్మవార్లు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొప్పుల కరుణాకర్‌రెడ్డి, పద్మ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వెన్న శ్రీనివాస్‌రెడ్డి, కవిత, రాందేని ఆదినారాయణ, పద్మ, 16వ వార్డు కౌన్సిలర్ సళిగంటి సరిత, వీరేందర్, 32వ వార్డు కౌన్సిలర్ జహీర్, మంచికంటి హనుమంతరావు, చుక్క యాదగిరి, కిరణ్ కుమార్, శ్రీదేవి, మాధవి, రజిత, మాస్టర్ రవి, సునీత, ప్రమీల, కోటమ్మ, గుమ్మ శీను పాల్గొన్నారు.

తిరుమలగిరి : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని గ్రామాల్లో భక్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలగిరి కొండపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు భక్తులకు ఉత్తర ద్వార దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు నర్సింగ నాగమ్మశ్రీనివాస్‌గౌడ్, దేవస్థాన డైరెక్టర్ కోటమర్తి మల్లయ్య, జూనియర్ అసిస్టెంట్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, అర్చకుడు అర్వపల్లి యోగానంద్, దాసరి సోమయ్య, పాక వీరేష్‌యాదవ్, కీర్తి వెంకటేశ్వర్లు, పెద్ది శ్రీనివాస్, గుడిపల్లి సోమిరెడ్డి, పున్న హరిప్రసాద్, శిగ రవి, కర్నాటి రంగయ్య, కె. సత్తిరెడ్డి, నారాయణ, ఎం. బాలకిషన్, శ్రీనివాస్, వెంకన్న, గణేష్, సదాలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

సూర్య క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

వైకుంఠ ఏకాదశి వేడుకలను పురస్కరించుకొని సోమవారం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. క్షేత్రంలోని రవి గర్భాలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకొని క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులందరికీ అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, కర్నాటి నాగేశ్వర్‌రావు, గణపురం నరేష్, కళ్యాణ్, శ్రీనివాస్, అర్చకులు రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆత్మకూరులోని శ్రీ చెన్నకేశ్వర స్వామి ఆలయంలో శ్రీగోదా సమేత చెన్నకేశవస్వామి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తంగెళ్ల వీరారెడ్డి, ఎంపీపీ మర్ల స్వర్ణలత, చంద్రారెడ్డి, కొణతం జయమ్మ, పందిరి కవిత, తంగెళ్ల లక్ష్మి, గాయత్రి, చిలకమ్మ, చిలుముల రాంరెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చందా కృష్ణమూర్తి, సందీప్‌రెడ్డి, లింగారెడ్డి, అర్చకులు శ్రీనివాసాచార్యులు, వెంకటరంగాచార్యులు, రమాకాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



తుంగతుర్తిలోని రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



ఆత్మకూరులో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇస్తున్న స్వామి అమ్మవార్లు



భానుపురి : స్వామిఅమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు



తిరుమలగిరి కొండపై పూజలు చేస్తున్న భక్తులు



భానుపురి : శ్రీవిజయాంజనేయస్వామి ఆలయంలో శోభాయాత్ర..



అర్వపల్లి : సూర్యక్షేత్రంలో కిక్కిరిసిన భక్తులు



భానుపురి : ప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

సీఎంకు శుభాకాంక్షలు



హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కిశోర్

రోడ్లపై కేజ్ వీల్స్ తిప్పడం నిషేధం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల పరిధిలోని ట్రాక్టర్ల యజమానులు రోడ్లపై కేజ్ వీల్స్ తిప్పినట్లయితే కేసులు నమోదవుతాయని పంచాయతీరాజ్ ఏఈ రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోడ్లపై కేజ్ వీల్స్ తిప్పడం వల్ల రోడ్లన్నీ దెబ్బ తింటున్నాయని తెలిపారు. రైతులు, ట్రాక్టర్ల యజమానులు తమకు సహకరించాలని కోరారు.

సెమినార్‌ను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ నేతలు

తిరుమలగిరి : జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగే సెమినార్‌ను విజయవంతం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఆనంద్‌భాస్కర్ కోరారు. సోమవారం తిరుమలగిరిలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా జిల్లా స్థాయి సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గుడిపాటి నరేష్, జి.వెంకటేశ్వర్లు, ఉమారాణి, రవికుమార్, హుస్సేన్, హెచ్ఎం అశోక్ పాల్గొన్నారు.

పోస్టల్ బీమా చేయించాలి

దురాజ్‌పల్లి : గ్రామ పంచాయతీ కార్మికులకు పోస్టల్ ప్రమాద బీమా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లాలోని 475 పంచాయతీల్లో 1745 మంది కార్మికులు పని చేస్తున్నారని, వీరికి రూ. 399 ప్రభుత్వమే చెల్లించి పోస్టల్ ప్రమాద బీమా చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనియాకుల శ్రీనివాస్, చిట్యాల రవిచంద్ర, విఘ్నేష్, లక్ష్మయ్య, సైదిరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

నడిగూడెం : రత్నవరంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో గరుడ వాహనం కొనుగోలుకు చాకిరాల గ్రామానికి చెందిన గడ్డమీద మల్లయ్య మనుమరాలు గుండ్ల ఫల్గుణి -చరణ్ దంపతులు రూ.65 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

కోనోకార్పస్‌తో ముప్పే

- ఆ వృక్షాల్లోని పుప్పొడితో శ్వాసకోస వ్యాధులు ప్రబలే ప్రమాదం
- పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాల్లో భారీగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు
- తొలగించాలని కోరుతున్న పర్యావరణ ప్రేమికులు



అర్వపల్లిలోని వననర్సరీ చుట్టూ ఉన్న కోనోకార్పస్ చెట్లు

అర్వపల్లి : పర్యావరణ పరిరక్షణకోసం ప్రభుత్వం హరితహారం పేరిట ప్రతిఏటా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అలాగే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా గతంలో పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నాటిన మొక్కల్లో చాలా చోట్ల కోనోకార్పస్ మొక్కలు ఉన్నాయి. అయితే ప్రాణాంతకమైన కోనోకార్పస్ మొక్కలను పెంచవద్దని ఇటీవలే ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కొత్తగా కోనోకార్పస్ మొక్కలను పెంచకపోయినప్పటికీ గతంలో నాటిన మొక్కలు పెద్దవై వృక్షాలుగా మారాయి. దీంతో ఈ చెట్ల మూలంగా ప్రమాదం పొంచి ఉంది. అయితే తక్కువ సమయంలో ఎక్కువ ఎత్తులో పెరిగే కోనోకార్పస్ మొక్కలను గతంలో అందం కోసం విదేశాల్లో పెంచేవారు. వీటి వల్ల జరిగే నష్టం తెలుసుకొని ఆయా దేశాల్లో నిషేధించారు. ఈ మొక్కలు ఎంత ప్రమాదమంటే వీటిపై కనీసం పక్షులు కూడా వాలవు.

అన్ని వన నర్సరీల్లోనూ..

మండల వ్యాప్తంగా 17 వననర్సరీలు, 17 వైకుంఠ ధామాలు ఏర్పాటు చేశారు. అయితే వీటిలో అనేక చోట్ల కోనోకార్పస్ మొక్కలు నాటారు. అవి పెరిగి వృక్షాలుగా మారాయి. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఈ మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. ప్రైవేటు స్థలాల్లో కూడా ఈ చెట్లు ఉన్నాయి. కోనోకార్పస్ మొక్క పుష్పాల నుంచి వెలువడే పుప్పొడి వల్ల అలర్జీ, శ్వాసకోశ, అస్తమా సమస్యలు వస్తున్నాయని శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. పలు చోట్ల రహదారులకు ఇరువైపులా ఈ చెట్లు దర్శనమిస్తూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి వీటిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పక్షులు కూడా ఈ చెట్లపై వాలవు



ప్రాణాంతకమైన కోనోకార్పస్ చెట్లపై పక్షులు కూడా వాలవంటే ఎంత ప్రమాదమో అర్థమవుతుంది. వీటి గాలిని పీల్చితే ప్రమాదమని ప్రభుత్వమే తేల్చింది. మండల వ్యాప్తంగా పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, రహదారులకు ఇరువైపులా ఉన్న ఈ చెట్లను అధికారులు వెంటనే తొలగించి వేయించాలి.

- గిరిబాబు, సామాజిక కార్యకర్త

ఈ చెట్లు పెంచవద్దని ఆదేశాలిచ్చాం



కోనోకార్పస్ మొక్కలు పెంచవద్దని అన్ని శాఖల వారికి ఆదేశాలిచ్చాం. గతంలో పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాల్లో నాటిన వాటిని కూడా తొలగించేలా చర్యలు తీసుకుంటాం. గత కొంతకాలంగా ఈ మొక్కలపై నిషేధం విధించి ఎక్కడా నాటడం లేదు. రహదారుల వెంట ఉన్న ఈచెట్లను కూడా తొలగించివేయాలి.

- పి. విజయ, ఎంపీడీఓ, జాజిరెడ్డిగూడెం

బాధితులకు పరామర్శ

పెన్‌పహాడ్ : అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బంటు శేఖర్ ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుడి చిత్రపటానికి సోమవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఇసుకపల్లి రమణయ్య రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోనం వెంకన్న, ముత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపన్యాస, వ్యాసరచన పోటీలు

నూతనకల్ : విద్యార్థులు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నతమైన చదువులు చదవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంఘమిత్ర చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంబేద్కర్ గొప్ప రాజకీయ, న్యాయవాది అని తెలిపారు. రాజ్యాంగాన్ని దేశప్రజలకు అందించిన అపరమేధావి అని తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు పదో తరగతి విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కాకి రాంరెడ్డి, తెలంగాణ మాలమహానాడు అధ్యక్షుడు తల్లమళ్ల హస్సేన్, ఏడిండ్ల అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



అర్వపల్లి : క్యాలెండర్‌లు, డైరీలను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

అర్వపల్లి : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్‌కే. సయ్యద్ అన్నారు. సోమవారం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌లు, డైరీలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత ఏడేళ్లుగా ఉపాధ్యాయుల పదోన్నతులు లేక ఉన్నత పాఠశాలల్లో బోధన కుంటుపడుతుందని చెప్పారు. పాఠశాలల్లో స్కావెంజర్‌లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డి. బాలాజి, శీనయ్య, విజిత, వర్దెల్లి కృష్ణ, ఎన్. వెంకన్న, కె. నర్సయ్య, చాంప్ల, శ్రీనివాస్, రవీందర్, వెంకన్న, సైదులు, ప్రశాంతి, సునంద, అలీ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : క్యాలెండర్‌లు ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నూతనకల్ : విద్యా, ఉద్యోగ రంగాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి పులుసు శ్రీనివాస్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను చేపట్టి, 317బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్, వంగపల్లి రమేష్, హన్మంతరావు, రాజేష్, మల్లన్న ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

తిరుమలగిరి : గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులను సోమవారం తిరుమలగిరి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో గుండెపురి ఎంపీటీసీ సభ్యులు జమ్మిలాల్, మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ భాస్కర్, నాయకులు పేరాల వీరేష్, రశీద్, రమేష్ తదితరులున్నారు.

అర్వపల్లి : కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా మండల కాంగ్రెస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి ఆ తర్వాత విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ ఉన్నారు.

ఆత్మకూరు (ఎస్) : సర్పంచ్‌ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంపై టీపీసీసీ పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్తున్న మండల కాంగ్రెస్ నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో వీరారెడ్డి, సైదిరెడ్డి, తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, లింగయ్య, మూల ఎల్లయ్య, శంకర్, ప్రతాప్ రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.



ఆత్మకూరులో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

మద్దిరాల : నిర్బంధాలతో ప్రశ్నించే గొంతుకలను ఆపలేరని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మామునూరి ఉపేందర్‌గౌడ్ అన్నారు. సర్పంచ్‌ల సమస్యలపై టీపీసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా సోమవారం పోలీసులు మండల కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో జిల్లా నాయకులు పాక అమృతమల్లు, మండల ప్రధాన కార్యదర్శి పయ్యావుల మహేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్యామ్, నాగిరెడ్డి సాయి పాల్గొన్నారు.

తుంగతుర్తి : రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్ అన్నారు. సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా స్థానిక కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో గంగరాజు, రాంబాబు, అనోక్, అనిల్, వినోద్ తదితరులు ఉన్నారు.

నాగారం : కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా సోమవారం పోలీసులు మండల కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్మకంటి సోమన్న, వెంకటభిక్షం, షేక్.వలీ ఉన్నారు.